క్లుప్తంగా

రద్దీని బట్టి సరస్వతి పుష్కరాలకు బస్సు సర్వీసులు

మిర్యాలగూడ టౌన్ : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమ స్నానమైన శ్రీకాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు ఈ నెల 26వరకు ప్రయాణికుల రద్దీని బట్టి డిపో నుంచి బస్సు సర్వీసులు నడిపించనున్నట్లు ఆర్టీసీ డీఎం రాం మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సరస్వతి పుష్కరాలు ప్రారంభమైనందున 26వతేదీ వరకు 30మంది ఉంటే ఒక బస్సును నడిపిస్తామన్నారు. మిర్యాలగూడ నుంచి సరస్వతి పుష్కరాలకు పెద్దలకు రూ.1500 కాగా చిన్నపిల్ల లకు రూ.800 ఒక్కొక్కరికి టికెట్ ఉంటుందన్నారు. ఆదివారం డిపో నుంచి పుష్కరాలకు బస్సు పంపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్టీసీ సీఐ భారతీబాయి తదితరులున్నారు.

ఉపాధి కూలీలకు తాగునీరు ఏర్పాటు



కూలీలకు తాగునీరు ఏర్పాటు చేసిన పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

అడవిదేవులపల్లి : మండలంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు పనిప్రదేశంలో తాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని గురువారం సాక్షిలో 'ఉపాధి కష్టాలు' అనే కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన ఎంపీడీఓ ఆదేశాల మేరకు గ్రామకార్యదర్శుల ఆధ్వర్యంలో పనిప్రదేశాలలో తాగునీరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాక్షి దినపత్రికకు ఉపాధిహామీ కూలీలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

పీఏపల్లి తహసీల్దార్‌గా జయశ్రీ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ జయశ్రీని సన్మానిస్తున్న సిబ్బంది

పెద్దఅడిశర్లపల్లి : మండల తహసీల్దార్‌గా జయశ్రీ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్‌రావు నల్లగొండ కలెక్టరేట్‌కి బదిలీ కాగా, హాలియాలో పనిచేస్తున్న జయశ్రీ బదిలీపై ఇక్కడి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను సిబ్బంది సన్మానించారు.

చందంపేట తహసీల్దార్‌గా శ్రీధర్‌బాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్‌బాబు

చందంపేట : మండల తహసీల్దార్‌గా డి.శ్రీధర్ బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన శ్రీనివాస్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో అడ్మకల్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన డి.శ్రీధర్‌బాబు పదోన్నతిపై మండల తహసీల్దార్‌గా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రెవెన్యూ సంబంధమైన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

మృతురాలి కుటుంబానికి మంత్రి పరామర్శ



రంగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే

మాడ్గులపల్లి : మండలంలోని పోరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పీఏ పోరెడ్డి వెంకట్‌రెడ్డి మాతృమూర్తి పోరెడ్డి రంగమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు గురువారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లతో కలిసి గ్రామానికి చేరుకొని రంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొండమల్లేపల్లి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఎదుట గురువారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన అమన్ ఐస్‌క్రీమ్‌లు అమ్ముకొని తన ఇంటికి వెళ్తే క్రమంలో పాఠశాల సమీపంలోకి రాగానే ఓ ట్రాక్టర్ యూటర్న్ తీసుకునే క్రమంలో అమన్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమన్‌కు తీవ్రగాయాలయ్యాయి.

నిరుపయోగంగా ట్రాఫిక్ సిగ్నల్స్

- ఇష్టానుసారంగా వాహనదారుల రాకపోకలు
- ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- సిగ్నల్ లైట్లకు మరమ్మతులు చేయాలని వేడుకోలు



రాజీవ్‌చౌక్ వద్ద నిరుపయోగంగా ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్



ఎన్‌టీఆర్ క్లాంపెక్స్ వద్ద పనిచేయని సిగ్నల్ లైట్లు

మిర్యాలగూడ టౌన్ : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణంలో వాహనాల రద్దీ రోజురోజుకు మరింత పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ఏనిమిదేళ్ల క్రితం పట్టణంలో దాతల సహకారంతో సుమారు మూడున్నర లక్షల వ్యయంతో మున్సిపల్ శాఖ సహకారంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద, హనుమాన్‌పేటలోని అద్దంకి- నార్కట్‌పల్లి బైపాస్ రోడ్డు వద్ద, తెలంగాణ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. ఆ సిగ్నల్ లైట్లు ఏడేళ్ల నుంచి పనిచేయకపోవడంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెద్ద వాహనాలు వెళ్లే సమయంలో పోలీసులు అడ్డుకుంటున్నప్పటికీ వివిధ రకాల సాకులతో సాగర్ రోడ్డు గుండా వెళ్తున్నారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. అయితే నాటి నుంచి నేటి వరకు కూడా ఈ సిగ్నల్ లైట్లు పట్టణంలో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వాటి నిర్వహణ పట్టించుకోకపోవడంతో ఉత్సవ విగ్రహంలా ఉండి ఎక్కిరిస్తున్నాయి. ప్రధానంగా సాగర్ రోడ్డు, డాక్టర్స్ కాలనీలలోనే అత్యంత రద్దీగా మారింది. పట్టణంలోని ఏ రోడ్డు గుండా వెళ్లాలన్నా ప్రజలు అనేక ఇబ్బందుల పడుతున్నారు. సాగర్ రోడ్డులో ప్రధానంగా ఎరువులు, విత్తనాలు విక్రయించే దుకాణాలు, వివిధ రకాల దుకాణాలు, బ్యాంకులు కూడా ఈ రోడ్డులోనే ఉండడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతుంది. సాగర్ రోడ్డులో షాపింగ్‌లకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి పార్కింగ్ స్థలం లేక రోడ్డుపైననే ద్విచక్ర వాహనాలు నిలుపుతున్నారు. వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అదే విధంగా ఈ రోడ్డు గుండానే ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులు వెళ్లడంతో పాటు ఆటోలు విపరీతంగా తిరగడం, కూరగాయాల మార్కెట్‌కు అధికంగా ప్రజలు రావడంతో అత్యంత రద్దీగా ఉంటుంది. ద్విచక్ర వాహనాలపై గానీ పాదచారులు ఈ రోడ్డు వెంట వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సివస్తుంది. పెరుగుతున్న ట్రాఫిక్‌ను నివారించేందుకు పోలీస్ సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నప్పటికి వారికి ఒత్తిడి కూడా మరింత అవుతుంది. అయితే ఈ ట్రాఫిక్ సిగ్నల్ లైట్లకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ఆ చౌరస్తాల్లో ప్రధాన సమస్య..

పట్టణంలోని సాగర్‌రోడ్డులో ఉన్న రాజీవ్‌చౌక్, తెలంగాణ చౌరస్తాలే కీలకంగా మారాయి. రాజీవ్ చౌక్ వద్ద ఒక వైపు ఖమ్మం రోడ్డు, మరో వైపు నల్గొండ, ఇంకా సాగర్ రోడ్డుతో పాటు షాబునగర్‌కు వెళ్లే రోడ్డు నాలుగు రోడ్లకు ఇది ప్రధాన కేంద్రంగా మారింది. అదే విధంగా తెలంగాణ చౌరస్తా (ఎన్‌టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్) వద్ద కార్మికులకు అడ్డ ఉండడంతో వివిధ ప్రాంతాలు, గ్రామాల నుంచి సుమారు రెండు వేల మందికి పైగా పనుల నిమిత్తం వస్తున్నారు. అదే విధంగా చర్చి రోడ్డు కూడా ఇక్కడే ఉండడంతో మరింత కీలకం అయింది. వాటికి తోడు రాగ్యానాయక్ చౌరస్తా(ఆర్టీసీ బస్టాండ్) ఈ బస్టాండ్ ఎదురుగా డాక్టర్స్ కాలనీ ఉండడంతో పాటు పాటు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆటోలు కూడా గేటు వద్ద ఉండడంతో కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ రోడ్డులో ఈ మూడు చౌరస్తాలే కీలకంగా మారిపోవడంతో కొంత ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేస్తున్నా రాజకీయ వత్తిళ్లు మరింత పెరిగిపోవడంతో వారు కూడా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం సాగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పట్టణంలో ట్రాఫిక్ సమస్యల రాకుండా స్నిగల్ లైట్లను ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సిగ్నల్ లైట్లను పునరుద్ధరించాలి

ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు సరిగా పనిచేయకపోవడంతో వాహనదారులు ఇష్టం వచ్చినట్లు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. సిగ్నల్ లైట్లు ఉంటే ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు. ఆటోలు ఎక్కడపడితే అక్కడ ఆపడంతో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్‌తో రోడ్డు దాటలేని పరిస్థితి నెలకొంటుంది. పని చేయని లైట్లను పునరుద్ధరించాలి.

– వెంకటేశ్వర్లు, మిర్యాలగూడ

అధికారుల దృష్టికి తీసుకెళ్తా

పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీ వల ట్రాఫిక్ సిగ్నల్ చాలా అవసరం. అయితే అప్పట్లో దాతల సహకారంతో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. కాని నిర్వహణ లేక చాలా కాలంగా నిరుపయోగంగానే ఉన్నాయి. ప్రస్తుతం సిగ్నల్ లైట్లు పోలీసుల ఆధీనంలో ఉన్నాయి. అయితే పట్టణ అభివృద్ధి దృష్ట్యా ఈ విషయంపై పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. అదే విధంగా విషయాన్ని మున్సిపల్ ప్రత్యేక అధికారితో పాటు ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్తా.

– మహ్మద్ యూసుఫ్, మున్సిపల్ కమిషనర్ మిర్యాలగూడ

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : గ్రామాల్లో తాగునీటి సమస్యల లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. దామరచర్ల మండలంలోని వాడపల్లి గ్రామ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నందున గురువారం ఆయన మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎలక్ట్రికల్, సిమెంట్ ఇండస్ట్రీస్ మేనేజ్‌మెంట్స్‌తో కలిసి గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామానికి వారం రోజుల్లో పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీరు అందించి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామంలో విద్యుత్ సమస్య రాకుండా చూడాలని, తాగునీటి కోసం పైప్‌లైన్స్, మోటార్స్ ఏర్పాటు చేయడంతోపాటు శివాలయంలో, లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల పరిసరాల్లో పార్కింగ్ కోసం స్థలంలో పూర్తిగా మట్టి పోయించి లెవల్ చేయాలని, నిరుపేద కుటుంబాల వివాహ శుభకార్యాలకు ఉపయోగపడేలా పరిసరాలను శుభ్రం చేయాలని అంబుజా సిమెంట్ యాజమాన్యానికి సూచించారు. అదే విధంగా గంగమ్మ తల్లి దేవాలయం పరిసరాల్లో కూడా పూర్తిగా మట్టి పోయించి లెవల్ చేయించాలని సూచించారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలక్ష్మి



అడవిదేవులపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ సరిత

దేవరకొండ : ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మి అన్నారు. గురువారం దేవరకొండ మండలంలోని కొండభీమనపల్లి రైతు వేదికలో దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, డిండి మండలాలకు చెందిన ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డీలర్లు నిబంధనల మేరకు రైతులకు మేలైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని సూచించారు. ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. సమావేశంలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

అడవిదేవులపల్లి : ఎరువులు, పురుగు మందులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి గుర్రం సరిత అన్నారు. గురువారం స్థానిక రైతు వేదికలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి డీలరు తప్పనిసరిగా ఎరువులు, విత్తనాలు, మందులకు సంబంధించిన రికార్డులు పకడ్బందీగా ఉండాలన్నారు. ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలను అమ్మితే సమాచారం అందించాలన్నారు. ప్రతి రైతు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు తీసుకున్నప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ సిబ్బంది, డీలర్లు తదితరులున్నారు.

బుద్ధ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ : నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలోని భీరాగాం గ్రామంలో గల బుద్ధ విగ్రహాన్ని ధ్వంసం చేసి దళితులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఉద్యోగ సంఘాల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా గురువారం పట్టంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వస్కుల మట్టయ్య మాట్లాడారు. భీరాగాం గ్రామంలో బుద్ధ పౌర్ణమి సందర్భంగా బుద్ధుడి విగ్రహం వద్ద పూజలు చేస్తుండగా కొందరు అగ్ర కులస్తులు వారిని అసభ్యకరంగా దూషించి భౌతికంగా దాడికి పాల్పడ్డారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విచారణ జరిపి దోషులను శిక్షించి బుద్ధ విగ్రహాన్ని ప్రతిష్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరుశురాం, మల్లయ్య, శ్రీను, కాంతయ్య, రవి, పద్మయ్య, అంజయ్య, మట్టయ్య, మల్లేష్, ఈశ్వరయ్య, రాజు పాల్గొన్నారు.

జానారెడ్డిని కలిసిన ఎస్పీ



జానారెడ్డికి మొక్క అందజేస్తున్న ఎస్పీ

నాగార్జునసాగర్ : మాజీ మంత్రి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డిని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం నాగార్జునసాగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

త్రిపురారం : మండల కేంద్రంలోని విద్యానగర్‌కాలనీలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004–2005వ విద్యాసంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు గురువారం పాఠశాలలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను తులచుకొని సంతోషంగా గడిపారు. 20ఏళ్ల తరువాత కలుసుకున్న వారు ఒక్కరికొకరూ ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి, ఈనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, దశరథ, నర్సిరెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

లింగయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి



లింగయ్య స్మారకస్తూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

వేములపల్లి : ప్రజాకవి పాలిశెట్టి లింగయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం లింగయ్య 13వ వర్ధంతి సందర్భంగా మండలంలోని సల్కునూరు ఎక్స్‌రోడ్డు వద్ద గల ఆయన స్మారక స్తూపానికి ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. లింగయ్య కాంగ్రెస్ పార్టీకి తన ఆటపాటలతో, కలంతో ఎన్నో సేవలు అందించారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, నాయకులు గడ్డం శ్రీనివాస్, గుంటోజు నాగరాజు, జెర్రిపోతుల సైదులు, అంకెపాక శ్రీనివాస్, కళాకారులు అంకెపాక కోటేష్, బచ్చలకూరి శ్రీనివాస్, వేముల శ్రవణ్, నల్ల శ్రీనివాస్, వేణు, శోభన్‌బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తోపుచర్లలో పారిశుద్ధ్య పనులు



డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మాడ్గులపల్లి : మండలంలోని తోపుచర్ల గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యపై గురువారం సాక్షి దినపత్రికలో 'ఇళ్ల మధ్యనే మురుగు' అనే కథనం ప్రచురితమైంది. అందుకు గ్రామపంచాయతీ కార్యదర్శి స్పందించి గురువారం గ్రామంలో సిబ్బందితో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ సాక్షి కృతజ్ఞతలు తెలిపారు.

- శిథిలావస్థలో జీపీ కార్యాలయ భవనం



మండలంలోని గాగిళ్లాపురం గ్రామపంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది, ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవనం నిర్మాణానికి చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– చందంపేట

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దవూర : కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న మండల కేంద్రంలో నిర్వహించే మండల స్థాయి సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు షేక్ బషీర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను కార్మిక సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో కార్మికులు, రైతులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొ ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు మంగారెడ్డి, ప్రభాకర్, అంజిరెడ్డి, మైను, శంకర్, హనుమంతు, కేశవులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆలయ కమిటీ సభ్యుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

హాలియా : తప్పుడు ధృవపత్రాలతో శివాలయాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు గురువారం సాగర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కొందరు కొంతకాలంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దేవాలయ ట్రస్టు, తహసీల్దార్ ప్రొసీడింగ్‌ను తప్పుడు కాగితాలుగా సృష్టించి వాటి ద్వారా దేవస్థానాన్ని రిజిస్ట్రేషన్ చేసుకొని ఇబ్బంది పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఆలయ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, ఉపాధ్యక్షుడు బందిలి పెద్దసైదులు, గౌరవ అధ్యక్షుడు పిల్లి తిరుపతయ్య, పాండునాయక్, నాగరాజు ఉన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

కొండమల్లేపల్లి : మండలంలోని పెండ్లిపాకల గ్రామ పంచాయతీలోని బాబ్లుతండా వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం కొండమల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్‌రెడ్డి పరిశీలించి రైతులతో మాట్లాడారు. మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలిస్తున్నారా లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఈఓ తిరుపతిరెడ్డి, నిర్వాహకులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

వర్షపు నీటిని.. ఒడిసిపట్టేలా

- ప్రజల భాగస్వామ్యంతో జలసంరక్షణ
- ఉపాధిహామీ పథకంలో పనులు



రైతు పొలంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన ఫాంపాండ్

దేవరకొండ : వర్షాలు సకాలంలో ఆశించిన స్థాయిలో కురిసినా వేసవి వచ్చిందంటే భూగర్భజలాలు అడుగంటి నీటిఎద్దడి నెలకొంటుంది. ఈ నేపథ్యంలో ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం జలసంరక్షణలో ప్రజల భాగస్వామ్యం అనే కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రధాని నరేంద్రమోదీ గతేడాది దీనిని ప్రారంభించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా జలసంరక్షణకు సంబంధించిన పనులు చేపట్టేందుకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. పట్టణాల్లోని గృహ నిర్మాణదారులు తప్పనిసరిగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలనే నిబంధన ఇప్పటికే ఉంది. కాగా ఇళ్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణ యజమానులు రూ.లక్షలు వెచ్చించి ఇళ్లు నిర్మించుకుంటున్నా వేలల్లో ఖర్చయ్యే ఇంకుడుగుంతల నిర్మాణాల విషయంలో పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీంతో వర్షపు నీటితో పాటు వాడిన నీరు మురుగు పాలవుతుంది. దేవరకొండ పట్టణంతో పాటు మండల పరిధిలో కొత్తగా ఏర్పడిన కాలనీల్లో కాల్వలు లేక మురుగు, వర్షపు నీరు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిల్వ ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

సిద్ధమైన ప్రణాళికలు..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలసంరక్షణ పథకంలో భాగంగా గ్రామాల్లో ఉపాధి కూలీలతో వివిధ పనులు చేపట్టేందుకు సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందించారు. కాగా ఇప్పటికే ఆయా గ్రామాల్లో చేపట్టే ఉపాధిహామీ పనులపై గ్రామసభలు నిర్వహించి ప్రాధాన్యత ప్రకారం పనులను గుర్తించి జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఇదిలా ఉంటే ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టే పనులను ఆమోదించి వాటిని చేపడుతున్నారు.

పనుల నిర్వహణ ఇలా..

ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామపంచాయతీల్లో చేపట్టే పనులను అధికారులు గ్రామసభల ద్వారా గుర్తించి ప్రణాళికాబద్ధంగా ఇందుకు సంబంధించిన పనులను కూలీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జలసంరక్షణ పనులకు సైతం అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారు.

- ఇంటిపై భాగంలో కురిసిన వర్షపు నీరు భూమిలో ఇంకే విధం (రూఫ్‌టాప్ హార్వెస్టింగ్) పనులు
- చేతి పంపులు, ఇళ్లల్లో వ్యక్తిగత ఇంకుడుగుంతల నిర్మాణం
- వ్యవసాయ పొలాల్లో నీటి నిల్వకుంటలు
- ఖాళీ స్థలాల్లో కందకాల నిర్మాణం
- అవసరమైన ప్రాంతాల్లో చిన్నపాటి నీటి కుంటలు ఏర్పాటు చేయడం.

ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి



ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టడంలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. రోజురోజుకు భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో ఇంకుడుగుంతల నిర్మాణం అనివార్యం. ఉపాధిహామీ పనుల్లో భాగంగా జలసంరక్షణ పనులకు కార్యాచరణ రూపొందించాం. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జలసంరక్షణకు సంబంధించి గ్రామసభల్లో వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రజలను చైతన్యపర్చాం. వర్షపు నీటిని ఒడిసి పట్టడంతో పాటు పొదుపు చేస్తే భావితరాలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– రామచంద్రం, ఏపీఓ, దేవరకొండ